నీరజ్‌కు రెండో స్థానం

ఒక్క సెంటిమీటర్ తేడాతో టైటిల్ కోల్పోయిన చోప్రా

చేతి గాయంతోనే బరిలోకి.. డైమండ్ లీగ్ ఫైనల్స్

మెగా ఈవెంట్లలో బరిలోకి దిగాడంటే పతకం పట్టుకురావడాన్ని అలవాటుగా మార్చుకున్న భారత 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా మరోసారి సత్తా చాటాడు. చాలాకాలంగా గజ్జల్లో గాయం వేధిస్తున్నా పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన ఈ స్టార్ జావెలిన్ త్రోయర్.. తాజాగా ఆ గాయానికి తోడు ఎడమ చేతి ఎముక విరిగినా డైమండ్ లీగ్ ఫైనల్స్ బరిలో నిలిచి రెండో స్థానంలో నిలిచాడు. తుదిపోరులో ఒకే ఒక్క సెంటిమీటర్ తేడాతో అగ్రస్థానాన్ని కోల్పోయినా.. ఏడాది పాటు నిలకడగా రాణించి 2024 సీజన్‌ను విజయవంతంగా ముగించాడు.

బ్రస్సెల్స్ (బెల్జియం) : భారత స్టార్ జావెలిన్ త్రోయర్, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా వరుసగా రెండో ఏడాదీ డైమండ్ లీగ్ (డీఎల్) ఫైనల్స్‌లో రెండో స్థానంతో మెరిశాడు. డీఎల్ టైటిల్ పోరులో అతడు ఒకే ఒక్క సెంటిమీటర్ తేడాతో టైటిల్ కోల్పోవడం విచారకరం. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక బ్రస్సెల్స్ వేదికగా జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నీరజ్.. బరిసెను 87.86 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. కొద్దిరోజుల క్రితమే పారిస్ వేదికగా ముగిసిన ఒలింపిక్స్‌లో రజతం సాధించిన నీరజ్.. డీఎల్ ఫైనల్స్‌లోనూ స్థాయికి తగ్గ ప్రదర్శన చేశాడు. ఇదివరకే గజ్జల్లో గాయం వేధిస్తున్నా.. తుదిపోరుకు ముందు ఎడమ చేతి వేలికి గాయమైనా నొప్పిని ఓర్చుకుని ఫైనల్ బరిలో నిలిచిన నీరజ్ తనపై పెట్టుకున్న అంచనాలను వమ్ము చేయలేదు. పారిస్‌లో కాంస్య పతకం గెలిచిన గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ 87.87 మీటర్ల దూరంతో అగ్రస్థానాన నిలిచి టైటిల్ దక్కించుకోగా జర్మనీ ఆటగాడు జులియన్ వెబర్ 85.97 మీటర్ల త్రో తో మూడో స్థానంలో నిలిచాడు.

తృటిలో టైటిల్ దూరం..

ఏడుగురు పోటీపడ్డ డీఎల్ ఫైనల్స్‌లో భాగంగా పీటర్స్ తన తొలి ప్రయత్నంలోనే బరిసెను 87.87 మీటర్లు విసిరాడు. నీరజ్ తన మొదటి త్రో (86.82 మీటర్లు)తో అతడికి దగ్గరిదాకా వచ్చినా ఆ మార్కును దాటలేకపోయాడు. రెండో ప్రయత్నంలో 83.49 మీటర్లే విసిరిన అతడు.. మూడో ప్రయత్నంలో మాత్రం పీటర్స్ త్రోకు అత్యంత సమీపంలోకి వచ్చాడు. ఇక ఆ తర్వాత మూడు త్రో లలోనూ అతడు జావెలిన్‌ను ఆశించిన స్థాయిలో విసరలేక రెండో స్థానంతోనే సరిపెట్టుకుని ఈ సీజన్‌ను ముగించాడు. తాజా ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచిన నీరజ్‌కు ప్రైజ్ మనీ కింద 12వేల యూఎస్ డాలర్లు (భారత కరెన్సీలో రూ. 10.06 లక్షలు) దక్కగా పీటర్స్‌కు డైమండ్ లీగ్ ట్రోఫీతో పాటు 30 వేల యూఎస్ డాలర్లు (రూ. 25.16 లక్షలు) దక్కాయి. ఏడాదంతా నిలకడగా రాణించిన నీరజ్‌కు డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో రెండో స్థానాన నిలవడం ఇది వరుసగా రెండోసారి. 2023లోనూ అతడు సెకండ్ ప్లేస్‌కే పరిమితమయ్యాడు. 2022లో మాత్రం టైటిల్ నెగ్గాడు.

గాయాలు వేధిస్తున్నా..

వరుసగా రెండు ఒలింపిక్స్‌లలోనూ పతకాలు (స్వర్ణం, రజతం) సాధించిన గోల్డెన్ బాయ్ మరోసారి గాయం కారణంగా అగ్రస్థానంలో నిలిచే అవకాశాన్ని కోల్పోయాడు. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు గజ్జల్లో గాయమైనా ఆ నొప్పితోనే విశ్వక్రీడల్లో బరిలోకి దిగి రజతం పట్టుకొచ్చాడు. ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్నా దేశం కోసం ఆ నొప్పిని పక్కనబెట్టి మరీ అంతర్జాతీయ క్రీడా యవనికపై ముప్పన్నెల పతకాన్ని రెపరెలాడించిన నీరజ్.. డీఎల్ ఫైనల్స్‌లోనూ అదే పట్టుదలను ప్రదర్శించాడు. ఈ పోటీ సన్నాహకాల్లో భాగంగా ఐదు రోజుల క్రితమే నీరజ్ ఎడమ చేతి వేలికి గాయమైంది. ఎక్స్‌రేలో నాలుగో వేలు దగ్గర చీలిక వచ్చినట్టు తేలింది. కానీ నీరజ్ మాత్రం తన వైద్య బృందం సూచనలతో బరిలో నిలిచి సత్తా చాటాడు. ఒక్క సెంటిమీటర్ దూరంతో డైమండ్ లీగ్ టైటిల్ కోల్పోయినా దేశం కోసం అతడు చూపిన తెగువకు సలామ్ కొట్టాల్సిందే!

ఇండియా 'ఏ' గెలుపు

రికీ భుయ్ పోరాడినా 'డీ'కి తప్పని ఓటమి • 'సీ' వర్సెస్ 'బీ' మ్యాచ్ డ్రా

అనంతపూర్: దులీప్ ట్రోఫీలో మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని ఇండియా 'ఏ' జట్టు తొలి గెలుపును రుచిచూసింది. అనంతపూర్ వేదికగా ఇండియా 'డీ'తో జరిగిన మ్యాచ్‌లో అగర్వాల్ సేన 186 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. 488 పరుగుల ఛేదనలో బరిలోకి దిగిన శ్రేయస్ అయ్యర్ 'డీ' జట్టు.. ఆఖరి రోజు 301 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టు బ్యాటర్ రికీ భుయ్ (113) శతకంతో పోరాడగా శ్రేయస్ (41), సంజూ శాంసన్ (40) రాణించారు. కానీ 'ఏ' బౌలర్లలో తనుష్ కొటియాన్ (4/73), శామ్స్ ములానీ (3/117) శ్రేయస్ సేనను నిలువరించారు. ఈ గెలుపుతో ఏడు పాయింట్లు సాధించిన 'ఏ' జట్టు ఫైనల్ ఆశలను నిలుపుకుంది. కాగా వరుసగా రెండు ఓటములతో 'డీ' జట్టు ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించినట్టే!

అన్షుల్ కంబోజ్‌కు 8 వికెట్లు

ఇండియా 'బీ', 'సీ' మధ్య జరిగిన మ్యాచ్ పేలవమైన డ్రా గా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో 'సీ' 525 పరుగుల భారీ స్కోరు చేయగా 'బీ' జట్టు 332 పరుగులకే ఆలౌట్ అయింది. 'సీ' బౌలర్ అన్షుల్ కంబోజ్ (8/69) ఏకంగా 8 వికెట్లు పడగొట్టాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన 'సీ'.. నాలుగో రోజు 128/4 పరుగులు చేసింది. దులీప్ ట్రోఫీలో మూడో దశ మ్యాచ్‌లు ఇదే వేదికపై ఈనెల 19 నుంచి మొదలవుతాయి.

హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ రేసర్ అఖీల్‌కు ట్రోఫీ

చెన్నై: ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో భాగంగా జరుగుతున్న ఫార్ములా 4 ఇండియన్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ రేసర్ అఖీల్ అలీభాయ్ మరోసారి మెరిశాడు. చెన్నైలోని మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో జరిగిన మూడో రౌండ్ నాలుగో రేసులో దక్షిణాఫ్రికాకు చెందిన అఖీల్.. రేసును 27 నిమిషాల 31.329 సెకన్లలో పూర్తిచేయడంతో అగ్రస్థానాన్ని దక్కించుకుని ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. అంతకుముందు మిగిలిన మూడు రేసులకు గాను అతడు రెండింట్లో రన్నరప్‌గా నిలిచాడు. నాలుగో రేసులో అహ్మదాబాద్ అపెక్స్ రేసర్ డీవీ నందన్ (27 నిమిషాల 50.567 సెకన్లు) రెండో స్థానంతో సరిపెట్టుకోగా శ్రాచి బెంగాల్ టైగర్స్ రేసర్ రుహాన్ అల్వా (27 నిమిషాల 51.089 సెకన్లు) మూడో స్థానం సాధించాడు.మరోవైపు ఇండియన్ రేసింగ్ లీగ్ మూడో రౌండ్‌లో చెన్నై టర్బో రైడర్స్ జట్టు డబుల్ ధమాకా మోగించింది. తొలి రేసుతో పాటు రెండో రేసునూ ఆ జట్టు గెలిచింది.

స్లాన్ స్పోర్ట్స్ కె రహేజా మైండ్‌స్పేస్ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్ కార్పొరేట్ చెస్ టోర్నీ ఉత్సాహంగా ముగిసింది. సుమారు 50 కంపెనీల నుంచి 150 మంది పాల్గొన్న ఈ టోర్నీలో ఆరుపాయింట్లు సాధించిన ఫణి కానూరి (కేర్లోన్) చాంపియన్‌గా నిలువగా అమర్‌నాథ్ (వెల్స్ ఫార్గో)కు రన్నరప్ ట్రోఫీ దక్కింది. సాయి కుమార్ (రియల్ పేజి), కార్తిక్ (ఏడీపీ) వరుసగా 3, 4 స్థానాల్లో నిలిచారు.

రన్నరప్ సహజ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కరేబియన్ దీవులైన డొమినికన్ రిపబ్లిక్ లోని పుంటకానా వేదికగా జరిగిన డబ్ల్యూ35 టెన్నిస్ టోర్నమెంట్‌లో తెలంగాణ యువ క్రీడాకారిణి సహజ యమలపల్లి డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. ఈ టోర్నీ మహిళల డబుల్స్‌లో సహజ-కులంబయేవ (కజకిస్థాన్) జోడీ.. 1-6, 7-5, 8-10తో అరియానా అర్సెనేల్ట్-కైలా క్రాస్ (కెనడా) చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. సింగిల్స్ విభాగంలో క్వార్టర్స్‌లోనే నిష్క్రమించిన సహజ డబుల్స్‌లో మాత్రం ఫైనల్‌కు చేరింది.

అన్మోల్ ఖర్బ్ సంచలనం

లెవన్ (బెల్జియం): భారత యువ టెన్నిస్ ప్లేయర్ అన్మోల్ ఖర్బ్ తన తొలి సీనియర్ టోర్నీలోనే సంచలన ప్రదర్శన చేసింది. బెల్జియం వేదికగా జరుగుతున్న బెల్జియన్ ఇంటర్నేషనల్ 2024 టోర్నీలో భాగంగా తొలి రౌండ్‌లో 17 ఏండ్ల అన్మోల్.. 24-22, 12-21, 21-10తో ప్రపంచ 80వ ర్యాంకర్ అయిన అమలి స్కూల్జ్ (స్విట్జర్లాండ్)ను చిత్తు చేసింది. సీనియర్ టెన్నిస్‌లో 222వ ర్యాంకు కలిగిన అన్మోల్.. సీనియర్ విభాగంలో ఆడుతూ తొలి మ్యాచ్‌లోనే తనకంటే మెరుగైన ర్యాంకర్‌ను మట్టికరిపించి ముందంజ వేయడం గమనార్హం.

ప్రపంచ స్కేట్ గేమ్స్‌కు తెలంగాణ స్కేటర్లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఈనెల 18 నుంచి 24 దాకా ఇటలీలో జరిగే వరల్డ్ స్కేట్ గేమ్స్-2024లో తెలంగాణ యువ క్రీడాకారులు ధృవీ లఖోటియా, మోక్షిత్ రామ్‌రెడ్డి చోటు దక్కించుకున్నారు. ధృవీ స్కేట్‌బోర్డ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనుండగా మోక్షిత్ రోలర్ ఫ్రీస్టైల్‌లో బరిలోకి దిగనున్నాడు. ప్రతిష్టాత్మకమైన ఈ గేమ్స్‌లో చోటు దక్కించుకున్నందుకు గాను కోచ్ జితేందర్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు.

నేడే భారత్, సౌత్ కొరియా సెమీస్ పోరు

ఏషియన్ చాంపియన్స్ హాకీ ట్రోఫీ

హులున్‌బుయిర్ (చైనా): ఏషియన్ చాంపియన్స్ హాకీ ట్రోఫీలో ఓటమన్నదే లేకుండా ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచిత్తుగా ఓడిస్తున్న భారత జట్టు నేడు కీలక పోరులో దక్షిణ కొరియాతో తలపడనుంది. సోమవారం జరుగనున్న తొలి సెమీస్‌లో భారత్.. కొరియాను ఢీకొననుంది. లీగ్ దశలో చైనా, జపాన్, మలేషియాపై అలవోక విజయాలు సాధించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన.. దక్షిణ కొరియాతో పాటు దాయాది పాకిస్థాన్‌నూ ఓడించి దూకుడు మీదుంది. భారత జట్టులో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఫుల్ జోష్‌లో ఉండగా సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్, ఉత్తమ సింగ్, అరేజిత్ సింగ్, యువ మిడ్ ఫీల్డర్ రాజ్‌కుమార్ పాల్ అంచనాలకు మించి రాణిస్తున్నారు. అంతేగాక ప్రత్యర్థి గోల్స్ యత్నాలను మన డిఫెన్స్ విజయవంతంగా అడ్డుకుంటోంది. ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. కొరియాను ఓడించి ఫైనల్ చేరుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు లీగ్ దశలో తమను ఓడించిన భారత్‌పై ప్రతీకారం తీర్చుకుని షాకిచ్చేందుకు దక్షిణ కొరియా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. రెండో సెమీస్‌లో పాకిస్థాన్.. చైనాతో తలపడనుంది. సెమీస్‌లో గెలిచిన జట్లు.. మంగళవారం ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

ఆసీస్, ఇంగ్లండ్ టీ20 సిరీస్ డ్రా

చివరి మ్యాచ్ వర్షార్పణం

ఓల్డ్ ట్రాఫర్డ్: ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ 1-1తో డ్రాగా ముగిసింది. ఈ సిరీస్ తొలి రెండు మ్యాచ్‌లలో ఇరు జట్లు తలా ఒకటి గెలువగా ఆదివారం ఓల్డ్ ట్రాఫర్డ్ వేదికగా జరగాల్సిన మూడో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. దీంతో రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య బ్లాక్‌బస్టర్ పోరును చుద్దామనుకున్న క్రికెట్ అభిమానులకు నిరాశే ఎదురైంది. ఆతిథ్య జట్టుతో ఆస్ట్రేలియా గురువారం నుంచి ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది.

నా బిడ్డను నేనే పెంచుతా..

అమ్మతనాన్ని పరిపూర్ణంగా అనుభవించడం అదృష్టం. ఆ అదృష్టానికి దూరం కాను. నా తల్లి నన్నెలా సాకిందో, నేనూ నా బిడ్డను అలానే సాకుతా. నా బిడ్డకు అమ్మ ప్రేమను సంపూర్ణంగా అందిస్తా.' అంటున్నది బాలీవుడ్ లేడీ సూపర్ స్టార్ దీపికా పదుకొణె. ఈ నెల 8న ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తన బేబీ పెంపకం విషయంలో దీపిక ఓ బలమైన నిర్ణయాన్ని తీసుకున్నదట. సాధారణంగా సెలబ్రిటీలూ.. తమ పిల్లల్ని చూసుకునేందుకు ఎక్కువ మొత్తంలో డబ్బు వెచ్చించి, నానీ(ఆయమ్మ)లను నియమిస్తుంటారు. కానీ దీపిక.. అలాంటి వాటికి తాను పూర్తి విరుద్ధమని తేల్చి చెప్పేసిందట. 'ఐశ్వర్య రాయ్, అనుష్కశర్మ కూడా తమ బిడ్డలను ఆయమ్మల సహాయం లేకుండానే పెంచుకున్నారు. నేనూ వారి దారిలోనే పయనిస్తా. నా బిడ్డను నేనే పెంచుతా. కెరీర్ కూడా దాని తర్వాతే.' అని పేర్కొన్నదట దీపిక. అంతే కాదు, తన పాపను ఫొటోలకు కూడా దూరంగా ఉంచాలని ఆమె నిర్ణయం తీసుకున్నదట. సరైన సమయం వచ్చినప్పుడే తమ బిడ్డను ప్రపంచానికి పరిచయం చేయాలని దీపిక దంపతులు భావిస్తున్నారని బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

ప్రేక్షకుల నవ్వులు చూస్తుంటే సంతోషంగా ఉంది

'సినిమా చూసి అందరూ హార్ట్‌ఫుల్‌గా నవ్వుకుంటున్నారు. 'మత్తువదలరా' వరల్డ్‌లో బాబు లాంటి పాత్రను నాకిచ్చిన దర్శకుడు రితేష్‌కి, నిర్మాతలకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా. సత్యతో వర్క్ చేయడం వెరీ వెరీ హ్యాపీ. మా సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్.' అని కథానాయకుడు శ్రీసింహ కోడూరి అన్నారు. ఆయన, సత్య ప్రధానపాత్రధారులుగా రితేష్ రానా దర్శకత్వంలో రూపొందిన హిలేరియర్స్ థ్రిల్లర్ 'మత్తు వదలరా 2'. ఫరియా అబ్దుల్లా కథానాయిక. మైత్రీ మూవీమేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు కలిసి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. స్టార్ దర్శకులు గోపీచంద్ మలినేని, శివ నిర్వాణ, వివేక్ ఆత్రేయ, అనుదీప్, మహేశ్‌బాబు ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరై చిత్ర బృందానికి అభినందనలు అందించారు. రితేష్ రానా వంటి క్లారిటీ ఉన్న దర్శకుడు దొరకడం తమ అదృష్టమని, విజువల్ ఫీస్ట్‌లా సినిమా తీశాడని, థియేటర్లలో ప్రేక్షకుల నవ్వులు చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని, ప్రతి చోటా అద్భుతమైన స్పందన వస్తున్నదని నిర్మాతలు తెలిపారు. ఇంకా దర్శకుడు రితేష్ రానా, సత్య, సంగీత దర్శకుడు కాలభైరవ, పంపిణీదారుడు శశిధర్‌రెడ్డి, నటుడు రాజా కూడా మాట్లాడారు.

చిత్రం

యువహీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి కథానాయిక. రవి తేజ ముళ్లపూడి దర్శకుడు. రామ్ తాళ్లూరి నిర్మాత. దీపావళి కానుకగా అక్టోబర్ 31న సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన తొలి పాటకూ, ఇతర ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నది. ఈ నెల 18న ఈ సినిమాలోని సెకండ్ సింగల్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. 'ఓ పిల్లో..' అంటూ సాగే ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, జెక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ పాటలో విశ్వక్‌సేన్, మీనాక్షి చౌదరిల లవ్లీ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. శ్రద్ధా శ్రీనాథ్, నరేష్, వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘురామ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ కటసాని, నిర్మాణం: ఎస్ఆర్‌టి ఎంటర్టైన్మెంట్స్.

పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్

కార్తీ కథానాయకుడిగా ఓ భారీ పీరియాడికల్ ఫిల్మ్ తెరకెక్కనుంది. ఇది కార్తి 29వ చిత్రం కావడం విశేషం. 'తానక్కరన్' సినిమాతో విమర్శకుల ప్రశంసలందుకున్న డైరెక్టర్ తమిళ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ ఆర్ ప్రభు, ఎషాన్ సక్సేనా, సునీల్ షా, రాజా సుబ్రమణియన్ నిర్మాతలు. కార్తీకి 'ఖైదీ' వంటి బ్లాక్‌బస్టర్ అందించిన సంస్థలో నిర్మితమవుతున్న సినిమా కావడంతో ఈ సినిమాపై తమిళనాట భారీ అంచనాలు ఏర్పాడ్డాయి. ఈ సినిమాను 2025లో విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే ఈ పానిండియా సినిమా షూటింగ్ మొదలుకానుంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు స్టార్ట్ చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్టైన్మెంట్, బిఫోర్‌యు మోషన్ పిక్చర్స్ ప్రతాకాలపై ఈ చిత్రం రూపొందనుంది.

ప్రతిష్టాత్మక గీతాఆర్ట్స్‌లో?

'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' తర్వాత నవీన్ పోలిశెట్టి విరామం తీసుకున్నారు. ఆయన చేతికి గాయం కావడమే ఈ విరామానికి కారణం. ఇప్పుడు నవీన్ పూర్తిగా తేరుకున్నారు. సినిమాలు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. తాజాగా గీతా ఆర్ట్స్‌లో ఓ సినిమా చేయడానికి ఆయన పచ్చ జెండా ఊపారని విశ్వసనీయ సమాచారం. ఇటీవల గీతా ఆర్ట్స్2 నుంచి వచ్చిన మంచి హిట్ 'ఆయ్'. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన అంజి దర్శకత్వంలోనే మరో సినిమా చేస్తామని 'ఆయ్' ప్రమోషన్‌లో నిర్మాత బన్నీ వాసు ప్రకటించారు. దానికి అనుగుణంగానే నవీన్ పోలిశెట్టి కథానాయకుడిగా అంజి దర్శకత్వంలోనే ఓ సినిమా చేయడానికి బన్నీవాసు పావులు కదుపుతున్నారట. నవీన్ కూడా అంజి దర్శకత్వంలో నటించేందుకు సుముఖంగానే ఉన్నట్టు సమాచారం. అయితే.. నవీన్‌ను మెప్పించే కథను అంజి చెప్పగలిగితే ఈ సినిమా త్వరలోనే పట్టాలెక్కే అవకాశం ఉంది.

వర్మ భయానక ప్రేమ

ప్రఖ్యాత దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందుతోన్న చిత్రం 'శారీ'. 'టూమచ్ లవ్ కెన్ బి స్కేరీ' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి సమర్పకుడు కూడా రామ్‌గోపాల్‌వర్మే కావడం విశేషం. సత్యా యాదు, ఆరాధ్యదేవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. గిరికృష్ణ కమల్ దర్శకుడు. రవివర్మ నిర్మాత. నవంబర్‌లో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్జీవీ డెన్‌లో ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఇది నిజజీవిత సంఘటనల మేళవింపుతో తెరకెక్కుతోన్న సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ఉత్తరప్రదేశ్‌లో ఎంతోమంది అమాయక మహిళలను మానభంగం చేసి, అతి క్రూరంగా చంపిన శారీ కిల్లర్ ఉదాంతానికి తెరరూపమే ఈ సినిమా అనీ, ఇందులో శారీ కిల్లర్‌గా సత్యా యాదు నటిస్తుండగా, తన అందంతో అతన్ని ఉన్మాదిగా మార్చిన అమ్మాయి పాత్రలో ఆరాధ్యదేవి కనిపిస్తారని మేకర్స్ తెలిపారు. ఈచిత్రానికి కెమెరా: శబరి.

తెలుగు తెరపై తమిళ మందారం

ఈ అమ్మాయి పేరు అతిథి శంకర్. ఈ అందాలబొమ్మది సామాన్యమైన నేపథ్యం కాదు. దక్షిణాది సినిమాను పానిండియా స్థాయికి తీసుకెళ్లిన గ్రేట్ డైరెక్టర్ శంకర్ ముద్దుల తనయే ఈ ముద్దుగుమ్మ. ఈమె మంచి గాయని కూడా. వరుణ్‌తేజ్ నటించిన 'గని' సినిమాలో ఓ పాట కూడా పాడింది. ఎంబీబీఎస్ చదివింది. అసలు విషయం ఏంటంటే.. ఈ చెన్నై చందమామ త్వరలో కథానాయికగా తెలుగుతెరపై అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. సినిమా పేరు 'వీర ధీర శూర'. బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఇందులో కథానాయకులు. ఇది తమిళ చిత్రం 'గరుడన్'కి రీమేక్. విజయ్ కనకమేడల దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. అతిథి కూడా సెట్లోకి అడుగుపెట్టింది. ముగ్గురు స్నేహితుల కథగా ఈ సినిమా రూపొందుతున్నదని, స్నేహం, స్వార్థం, ప్రతీకారం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ సినిమాలో మరో కథానాయిక కూడా ఉందట. ఆమె పేరు త్వరలో ప్రకటిస్తారట.

మా నమ్మకం నిజమైంది

ధృవ వాయు స్వీయదర్శకత్వంలో నటించిన చిత్రం 'కళింగ'. దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ కలిసి నిర్మించిన ఈ సినిమా ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. హీరో, దర్శకుడు ధృవ వాయు మాట్లాడుతూ 'మౌత్ టాక్‌తో ఈ సినిమా అందరికీ చేరువ అవుతున్నది. ఈ సినిమలోని విజువల్స్, అమ్మవారిని చూపించిన తీరు.. ఇలా ప్రతి అంశం గురించీ ఆడియన్స్‌ని మాట్లాడుకుంటున్నారు. అందరూ ప్రాణంపెట్టి పనిచేశారు కాబట్టే ఈ విజయం. కంటెంట్ ఉన్న సినిమాను ఆడియన్స్ కచ్చితంగా హిట్ చేస్తారు. ఈ సినిమాతో అది రుజువైంది.' అని చెప్పారు. దర్శకుడిపై మేం పెట్టుకున్న నమ్మకం ఈ విజయంతో నిజమైందని నిర్మాతలు ఆనందం వ్యక్తం చేశారు. ఇంకా హీరోయిన్ ప్రగ్యా నయన్, చీఫ్ మార్కెటింగ్ హెడ్ వంశీ, కెమెరామేన్ అక్షయ్ కూడా మాట్లాడారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.